క్లుప్తంగా

పాఠశాలలను సందర్శించిన ఎంఈఓ



పెద్దింపేట పాఠశాల వద్ద కిచెన్‌గార్డెన్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ

బలిజిపేట: పాఠశాల ఆవరణలలో కిచెన్ గార్డెన్‌లను నిర్వహించాలని ఎంఈఓ–1సామల సింహాచలం తెలిపారు. మండలంలో పెద్దింపేట, గౌరీపురం ప్రాథమిక పాఠశాలలను ఆయన శుక్రవారం సందర్శించారు. పాఠశాలల ఆవరణలో కూరగాయల మొక్కలను పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. దీనివలన విద్యార్థులకు మంచి పౌష్టికాహారం అందించవచ్చన్నారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న భానుమూర్తి

పార్వతీపురం టౌన్: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ధ్యేయమని ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ పెంట భానుమూర్తి అన్నారు. పట్టణంలోని ఎన్జీఓ హోంలో జిల్లా కార్యవర్గ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1/2019 సర్క్యులర్‌ను కొందరు అధికారులు అమలు చేయకుండా నిబంధనలు పక్కనపెట్టి ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటున్న విధానాన్ని మానుకోవాలన్నారు. సమావేశంలో ఎంప్లాయీస్ యూనియన్ జోనల్ సెక్రటరీ బి.కృష్ణమూర్తి, జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు, డి.దుర్గారావు, బీఎస్‌రావు, టీవీ నాయుడు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

నిషేధ వస్తువులపై నిఘా



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ

కొమరాడ: గంజాయి, అక్రమ మద్యం తదితర నిషేధ వస్తువుల రవాణాపై పక్కాగా నిఘా పెట్టామని ఎస్ఐ కె.నీలకంఠం తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒడిశా నుంచి వస్తున్న వాహనాలను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ మద్యంతో పాటు గంజాయి, గుట్కా తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు.

బొకేలు తీసుకురావద్దు : కలెక్టర్

పార్వతీపురం: తనను కలవడానికి వచ్చేవారు బొకేలు తీసుకురావద్దని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. తనను మర్యాదపూర్వకంగా కలవడానికి పలువురు రావడం, బొకేలు తేవడం పట్ల కలెక్టర్ స్పందించారు. బొకేలు ఏమీ తీసుకురావద్దని, ఉత్తి చేతులతో రావడానికి మొహమాట పడితే పోటీ పరీక్షలకు, గ్రంథాలయాలకు ఉపయోగపడే పుస్తకాలు తీసుకురావడం మంచిదన్నారు. పుస్తకాలను జిల్లాలో ఏర్పాటు చేస్తున్న గ్రామ, పట్టణ విజ్ఞాన కేంద్రాలకు అందిస్తామన్నారు. పుస్తకం దీర్ఘకాలం జ్ఞాపకంగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

వైటీసీలో సమస్యలు పరిష్కరించాలి



వసతిగృహంలో గర్భిణులతో మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకులు

సాలూరు: పట్టణంలోని వైటీసీలో గిరిశిఖర గర్భిణుల వసతిగృహంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు సీదరపు అప్పారావు, నాయకులు సుందరరావు, జానకిరావు, మర్రి శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం వసతిగృహాన్ని వారు సందర్శించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ గర్భిణులు వినియోగిస్తున్న బాత్‌రూంలు మురికిపట్టి, కంపు కొడుతున్నాయని తెలిపారు. వసతి సదుపాయాలు బాగోలేదని, ఆర్‌ఓ ప్లాంట్ మరమ్మతులకు గురైందని తదితర సమస్యలను వివరించారు. వీటిపై ఐటీడీఏ అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే గిరిజనులతో కలిసి పోరాటం చేస్తామని తెలిపారు.

అమరుల త్యాగాలను మరువలేం

- ఘనంగా కార్గిల్ విజయ్ దివాస్
- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



అమరులైన సైనికుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



ర్యాలీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తదితరులు

పార్వతీపురం/పార్వతీపురం టౌన్: దేశ రక్షణకు ప్రాణాలర్పించిన వీర సైనికుల త్యాగాలు మరువలేనివని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. భారతీయ యువమోర్చా, మాజీ సైనికుల ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన విజయ దివాస్ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. యుద్ధంలో మరణించిన సైనికుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి, శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కార్యాలయం నుండి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు నిర్వహించిన ర్యాలీని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 1999 జూలై 26వ తేదీన కార్గిల్ యుద్ధంలో మన సైన్యం సాధించిన విజయానికి గుర్తుగా విజయ్ దివాస్ జరుపుకుంటున్నట్లు తెలిపారు. దేశ రక్షణకు సైనికులు తమ ప్రాణాలు అర్పించారని, పాకిస్తాన్ దురాక్రమణను తిప్పికొట్టారన్నారు. సైనికులు వారి కుటుంబ సభ్యులు చేసిన త్యాగాల ఫలితంగా దేశంలో మనం ప్రశాంతంగా జీవిస్తున్నామన్నారు.

మనమంతా సైనికుల త్యాగాలను మననం చేసుకోవాల్సిన అవసరం ఉందని, దేశ రక్షణ, అభివృద్ధికి యువత పాటుపడాలని తెలిపారు. కార్యక్రమంలో భారతీయ యువ మోర్చా ప్రతినిధులు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, మాజీ సైనికులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

సోలార్ రూఫ్‌టాప్‌ను నిర్మించుకోండి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం కింద రాయితీతో ఇంటిపై సోలార్ రూఫ్ టాప్‌ను నిర్మించుకొని విద్యుత్ బిల్లును తగ్గించుకోవచ్చునని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో పథకానికి సంబంధించి వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 10 సెంటీమీటర్లు లేక 100 చదరపు అడుగుల స్థలంలో సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకోవచ్చునన్నారు. ఒక కిలోవాట్ సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు సామర్థ్యానికి ఉత్పత్తి అయ్యే యూనిట్లు 120, వినియోగదారునికి వస్తున్న ప్రస్తుత బిల్లు రూ.1000లు సోలారు ఏర్పాటు తరువాత వచ్చే బిల్లు రూ.3వేలు ఏడాదికి ఈ లెక్కన 8వేల వరకు ఆదా చేసుకోవచ్చునని తెలిపారు. ప్రభుత్వ రాయితీ రూ.30వేలు ఉంటుందని తెలిపారు. అలాగే రెండు, 3 కిలోవాట్‌లు సోలార్ రూఫ్‌టాప్‌ను నిర్మించుకుంటే రాయితీ రూ.78వేల వరకు వస్తుందన్నారు. ఆసక్తి గల వినియోగదారులు ఏపీడీసీఎల్ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీడీసీఎల్ ఎస్‌ఈ ఎం.లక్ష్మణరావు, ఈఈ వీవీ కిశోర్, డీఈ ఎం.రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

'సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి'



బలిజపేట పీహెచ్‌సీని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి రాబర్ట్‌పాల్

బలిజిపేట: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ ముందస్తు జాగ్రత్తలు పాటించాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి, మండల ప్రత్యేకాధికారి రాబర్ట్‌పాల్ అన్నారు. మండలంలో బలిజిపేట పీహెచ్‌సీ, నారాయణపురం, మిర్తివలస, బర్లి గ్రామాలను ఆయన శుక్రవారం సందర్శించారు. పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలించారు. ఓపీని పరిశీలించారు. వైద్య సేవలపై ఆరా తీశారు. నారాయణపురం రైతుసేవ కేంద్రాన్ని తనిఖీ చేశారు. గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి పిల్లల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఏఓ శ్రావణ్, సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహనతో వ్యాధులు దూరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రోగ్రాం అధికారి జగన్‌మోహన్‌రావు

- హెల్త్ ప్రోగ్రాం అధికారి జగన్‌మోహన్‌రావు

పార్వతీపురం టౌన్: అవగాహన ద్వారా వ్యాధులను దరి చేరకుండా ముందస్తుగా జాగ్రత్త పడవచ్చని హెల్త్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ జి.రామారావు ఆధ్వర్యంలో వ్యాధులపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, సీజనల్ వ్యాధులు, రక్తహీనత, పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారం, రోగ నిరోధక శక్తి తదితర వాటిపై అవగాహన, పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. మలేరియా, డెంగీ తదితర సీజనల్ జ్వరాలకు దోమలు ప్రధాన కారణమని ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వీటికి దూరంగా ఉండవచ్చన్నారు. దోమల నివారణ చర్యలు చేపట్టాలన్నారు. కిశోర బాలికలు రక్తహీనతకు గురి కాకుండా ఐరన్ మాత్రలు వేసుకోవాలని, సంతుల ఆహారం తీసుకోవాలని సూచించారు. చేతుల పరిశుభ్రత ప్రాధాన్యతను తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సత్తిబాబు, నారాయణమ్మ, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

వర్షం నీటి నడుమ రేషన్ బియ్యం



గొడాంలో వర్షపు నీరు

సాలూరు: ప్రజలకు పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యం బస్తాలు వర్షపు నీటి మధ్యలో ఉన్నాయి. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలో తహసీల్దార్ కార్యాలయ వెనుకన ఉన్న పౌర సరఫరాల సరుకుల నిల్వల గిడ్డంగి శిథిలావస్థకు చేరుకుంది. ఇక్కడ నుండే సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాలకు రేషన్ సరుకులు, జీసీసీ సరుకులు సరఫరా చేస్తుంటారు. అయితే ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఈ గిడ్డంగి పైకప్పు నుండి నీరు కారుతుంది. మరో వైపు గిడ్డంగిపై ఉన్న రేకుల సపోర్టింగ్ కర్రలు విరిగి పోయాయి. దీనితో నిచ్చెనలు వేసి వాటికి సపోర్ట్‌గా పెడుతున్న పరిస్థితి కనిపించింది. గొడాంలోకి వర్షపు నీరు కారుతుండడంతో రేషన్ బియ్యం, సరుకులు తడిచిపోయే ప్రమాదముంది. దీనితో అధికారులు టార్పాలిన్‌లు కప్పి భద్రపరిచే ప్రయత్నం చేస్తున్నారు. నీటిని బయటకు పంపించే ఏర్పాట్లు చేసారు.

అంధకారంలో గిరిశిఖర గ్రామాలు

- ప్రబలుతున్న జ్వరాలు



పగులుచెన్నేరులో జ్వరంతో బాధపడుతున్న కూనేటి జాంబ్రి


సాలూరు: మండలంలోని ఆంధ్రా – ఒడిశా వివాదాస్పద కొటియా గ్రూపు గిరిశిఖర గ్రామాలు వారం రోజులుగా అంధకారంలో ఉన్నాయి. పట్టుచెన్నేరు. పగులుచెన్నేరు పంచాయతీ గ్రామాలతో పాటు డోలియాంబ, ఎగువమెండంగి, సొల్పగూడ, కోనదొర, ముడకారు తదితర గిరిశిఖర గ్రామాల్లో వారం రోజుల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని గ్రామస్తులు తెలిపారు. సాయంత్రమైతే చీకటిలో భయంభయంగా గడుపుతున్నామని ఆయా గ్రామాలకు చెందిన బేసు, చుక్కయ్య, బేతురు, సామి తదితరులు తెలిపారు. విద్యుత్ శాఖాధికారులకు విషయం తెలిసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరో వైపు పట్టుచెన్నేరు, పగులుచెన్నేరు గ్రామాల్లో సుమారు 20 మంది వరకు జ్వరాలతో ఉన్నారని వారు తెలిపారు. అధికారులు స్పందించి గ్రామాలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడంతో పాటు వైద్య శిబిరాలు నిర్వహించాలని కోరారు.

ఉచిత ఇసుకను అందుబాటులో ఉంచాలి


పార్వతీపురం: ఉచిత ఇసుకను ప్రజలకు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని భూగర్భ గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా పేర్కొన్నారు. శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్లతో ఆయన మాట్లాడుతూ ఇసుకను ప్రభుత్వం లబ్ధిదారులకు ఉచితంగా అందిస్తుందని, రవాణా ఖర్చులు సాధ్యమైనంత తక్కువగా ఉండేటట్లు చూడాలన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గుర్తించిన ఇసుక రీచ్‌ల నుండి మాత్రమే ఇసుకను సేకరించాలన్నారు. కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, జేసీ ఎస్ఎస్ శోభిక, డీఆర్‌ఓ జి.కేశవనాయుడు, ఆర్‌డీఓ కె.హేమలత పాల్గొన్నారు.

ఫ్రైడేను డ్రైడేగా పాటించాలి

- డ్వామా పీడీ రామచంద్రరావు



సీతానగరం: జోగింపేట స్కూల్ ఆఫ్‌ఎక్స్‌లెన్స్‌లో మాట్లాడుతున్న పీడీ రామచంద్రరావు



పార్వతీపురం టౌన్: ఫ్రైడే – డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాస్

సీతానగరం: ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని తప్పనిసరిగా మండల స్థాయి అధికారులు పాటించాలని డ్వామా జిల్లా పీడీ, మండల ప్రత్యేకాధికారి కె.రామచంద్రారావు అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలో అమలవుతున్న పారిశుద్ధ్య పక్షోత్సవాల్లో భాగంగా తాన్నసీతారాంపురం, జోగింపేట స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ వసతిగృహాన్ని, విద్యాలయ ప్రాంగణాన్ని శుక్రవారం పరిశీలించారు. ముందుగా సీతారాపురంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. శిథిలావస్థకు చేరిన ప్రాథమిక పాఠశాల భవనాన్ని పరిశీలించారు. స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో వంట గదులను పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు, ఈఓపీఆర్‌డీ కె.కుమారవర్మ, ప్రిన్సిపాల్ ధర్మరాజు, పంచాయతీ కార్యదర్శులు, వసతిగృహ సంక్షేమాధికారి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. మండలంలో డ్రైడే కార్యక్రమాలు పక్కాగా నిర్వహించాలని జెడ్పీటీసీ ఎం.బాబ్జీ అన్నారు. లచ్చయ్యపేటలో సర్పంచ్ సీహెచ్ కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఫ్రైడే – డ్రైడే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తామరఖండిలో ఈఓపీఆర్‌డీ కె.కుమారవర్మ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

పట్టణంలో డ్రైడే

పార్వతీపురం టౌన్: పట్టణంలోని 15 వార్డుల్లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలో శుక్రవారం జరిగిన పారిశుద్ధ్య కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ప్రజలకు అవగాహన కల్పించారు. మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

• పిల్ల కాలువ కాదు.. రహదారే...



ఈ చిత్రం చూసిన వారు ఎవరైనా దీనిని ఏదో పంట పొలాలకు సాగునీరందించే పిల్ల కాలువ అనుకుంటారు. కానీ ఇది సాలూరు మున్సిపాలిటీలోని బంగారమ్మ కాలనీ రహదారి. చిన్నపాటి వర్షం కురిసినా ఈ కాలనీలో రహదారిపై నీరు నిలిచిపోయి పిల్ల కాలువను తలపిస్తోంది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షపు నీరు నిల్వ ఉండడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. – సాలూరు

నాణ్యమైన విద్యతో సత్ఫలితాలు : డీఈఓ



వంతరాం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈఓ

బలిజిపేట: నాణ్యమైన విద్యతో సత్ఫలితాలను సాధించవచ్చని డీఈఓ పగడాలమ్మ అన్నారు. వంతరాం ఉన్నత పాఠశాల, కేజీబీవీలను ఆమె శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా తరగతుల్లో విద్యార్థులతో మమేకమయ్యారు. విద్యార్థులను పాఠ్యాంశాలపై ప్రశ్నించారు. పాఠశాల నిర్వహణ, మధ్యాహ్న భోజన పథకంపై వారి నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తరగతి గదిలో విద్యార్థులను పాఠ్య ప్రణాళికలపై ప్రశ్నించగా అందుకు తగిన విధంగా సమాధానం చెప్పడంతో ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో వంటకాలను రుచి చూశారు. మంచి పౌష్టికాహారాన్ని విద్యార్థులకు అందించాలని భోజన నిర్వాహకులకు సూచించారు. ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో విద్యాభివృద్ధి, పదో తరగతి ఫలితాలపై ఇప్పటి నుంచే దృష్టి సారించాలన్నారు. కేజీబీవీ పాఠశాలలో తరగతి గదులను పరిశీలించారు. ఆమె వెంట హెచ్‌ఎం చిన్ని వెంకటరమణ, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు



విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ పావని



బాలగుడబ గ్రామంలో వైద్య సేవలందిస్తున్న డాక్టర్ శ్రీకాంత్

సీతానగరం: మరిపివలస ఉన్నత పాఠశాల విద్యార్థులు, బాలికల వసతిగృహ విద్యార్థినిలకు మండల పీహెచ్‌సీ వైద్యాధికారిణి పావని శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, స్థానికంగా ఉన్న వసతిగృహ పరిసరాలను పరిశీలించారు. అనంరం సూరంపేటలో పర్యటించి సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పంచాయతీ సర్పంచ్ సాంబందొర, కార్యదర్శి సంతోష్‌కుమార్, హెల్త్ సూపర్‌వైజర్లు కె.భవాని, ఎంఎల్‌హెచ్‌పీ సీహెచ్ గౌరమ్మ, చంద్రినాయుడు, శ్రావణి, ఉపాధ్యాయులు, సంక్షేమ అధికారిణి పాల్గొన్నారు.

బాలగుడబలో..

పార్వతిపురం టౌన్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి శ్రీకాంత్ తెలిపారు. మండలంలోని బాలగుడబ గ్రామంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో క్రమం తప్పకుండా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో జ్వరాల బారిన పడిన వారిని గుర్తించి వారందరికీ వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ గ్రామాల్లో అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో 104 సిబ్బంది, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

రూ.25లక్షల పరిహారం ఇవ్వాలి

- ప్రజా సంఘాల నాయకుల డిమాండ్



మృతి చెందిన విద్యార్థి రాఘవ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

మక్కువ: మృతి చెందిన గిరిజన విద్యార్థి రాఘవ కుటుంబానికి ప్రభుత్వం రూ.25 లక్షలు పరిహారం అందించాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకుడు తాడంగి ప్రభాకర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. మండలంలోని దుగ్గేరు గ్రామానికి చెందిన ఆరవ తరగతి చదువుతున్న గిరిజన విద్యార్థి రాఘవ మలేరియాతో ఈ నెల 21న మృతి చెందడంతో శుక్రవారం ప్రజాసంఘాల నాయకులు కొల్లి గంగునాయుడు, ప్రభాకర్ విద్యార్థి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన్యం జిల్లాలో వెంటనే ప్రభుత్వం హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలన్నారు. దుగ్గేరు గ్రామానికి చెందిన రాఘవ, కురుపాం, గుమలక్ష్మీపురం మండలాలకు చెందిన పృథ్వీ, గౌతమ్ అనే విద్యార్థులు మలేరియాతో మృతి చెందడంతో ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ప్రభుత్వ వసతిగృహాలలో ఏఎన్‌ఎంలను నియమించాలని డిమాండ్ చేశారు. పై సమస్యలను సోమవారం జిల్లా ఆదివాసీ సంఘం, ప్రజా సంఘాల నాయకులంతా కలిసి జిల్లా వైద్యాధికారి దృష్టికి తీసుకువెళ్తామని, రెండు రోజుల్లో సమస్యలు పరిష్కరించకపోతే పోరాటం చేస్తామన్నారు.

ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే సహించేది లేదు...

- మున్సిపల్ ఛైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ



మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ

సాలూరు: మున్సిపాలిటీలో ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే సహించేది లేదని మున్సిపల్ ఛైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అన్నారు. మున్సిపల్ కార్యాలయాన్ని ఆమె శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మున్సిపల్ మేనేజర్ శ్రీరాఘవాచార్యులుతో మాట్లాడారు. మున్సిపల్ కార్యాలయంలో కొందరు సిబ్బంది ఇష్టం వచ్చినట్లు సెలవులు తీసుకుని, మరుసటి రోజు వచ్చి రిజిస్టర్‌లో ముందురోజు కూడా వచ్చినట్లు రిజిస్టర్‌లో హాజరు వేసుకుంటున్నారని మా దృష్టికి వచ్చిందని అన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫైళ్లు క్లియర్ చేయాలని ఆదేశించారు. ఉద్యోగులు, సిబ్బంది సమయపాలన పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.